
# నిమ్మమొక్క



**గిరిజా చంద్ర**

ఆ ఇల్లు దగ్గర కొస్తుందంటేనే నాకేదో చెప్పలేని ఆనందం కలుగుతుంది. అక్కడ నేను పొందే ప్రశాంతత మరెక్కడా లభించదని రెండు సంవత్సరాలుగా నాకూ, ఆ ఇంటికీ వున్న అనుబంధం చెప్తుంది.

హరి నాకు క్లాస్‌మేటే అయినా నేనెక్కువగా అభిమానించేది వాళ్ళ అమ్మనే. దాదాపు రోజూ వాళ్ళింటికెళ్ళేది ఆవిడ కోసమే. హరి ఎప్పుడూ అంటాడు "ఆడవాళ్ళు. అందులో పెద్దవాళ్ళతో మనకేం మాటలోయ్? బజారు కెళ్దాంపద," అని.

అతడు రోజు మొత్తంమీద ఇంట్లో వుండే సమయం లెక్కేస్తే కాలేజీలో ఉండేదానికన్నా కూడా తక్కువేనని నా అనుమానం. ఎప్పుడూ స్నేహితులతో కాలక్షేపం చేయటమే అతని లక్ష్యం. అయినా నేనుమాత్రం అతన్నెప్పుడూ లక్ష్యపెట్టలేదు. హరి ఉన్నా, లేకున్నా వాళ్ళింటికి వెళ్ళకుండా ఒక్కరోజు కూడా వుండలేను.

సరస్వతమ్మగారు నలభైలోకి ప్రవేశించినా చూట్టానికి ముప్పైరెండు కన్నా వయసెక్కువుండదనిపిస్తుంది. ఆవిడతో మాట్లాడుతుంటే నాకు వయోభేదం గుర్తురాదు. చిన్నప్పటి నుంచి నాయీడు వాళ్ళతో కంటే పెద్దవాళ్ళతో గడపటమే నాకిష్టం. అందుకే ఆవిడకీ, నాకూ మధ్య అంత సన్నిహిత్యం ఏర్పడింది.

'హరి ఉండడు' అనుకుంటూనే ఆ ఇంట్లో అడుగుపెట్టాను.

"రావోయ్! అక్కడే నిలబడ్డావేం? ఆ కుర్చీ లాక్కొని కూర్చో" నన్ను చూడగానే అన్నారు ఆవిడ. మంచానికి దగ్గరగా కుర్చీ వేసుకొని కూర్చున్నాను.

ఆ రోజు ఆవిడ నామీద ఒక బాధ్యత పెట్టారు. బాధ్యతంటే ఏదో పెద్ద బరువను కునేరు సుమా? మరేం లేదు. ఒక నిమ్మ మొక్క తెచ్చిపెట్టాలట. హరితో ఎన్నిసార్లు చెప్పినా విన్పించుకోవటంలేదట.

"నేను చాలా చోట్ల ప్రయత్నించానోయ్? కాని దొరకలేదు" నిరుత్సాహంగా అన్నారు ఆవిడ.


"ఇది మీ సొంత యిల్లు కాదుగదండీ" అన్నాను సందేహాన్ని స్వల్పంగా వెల్లడి చేస్తూ.

"నిజమే" తలవూపి అన్నారు ఆవిడ. "కాని నాకు చెట్లమీద చచ్చేంత మమకారం. మా దొడ్లో చాలాచెట్లు పెట్టాను. అదితప్ప. ఒక నిమ్మమొక్క తెచ్చి పెట్టావంటే నీ మేలు మరిచిపోనోయ్." నేను తెస్తాననే ప్రగాఢ విశ్వాసం ఆవిడ మాటల్లో కనిపించింది నాకు. నామీదవున్న నమ్మకానికి సంతోషమేకానీ బాధ్యతని నెరవేర్చాలంటే కాస్త రిస్క్ తీసుకోవాలి, తప్పదు.

"సరే! తెస్తాననుకోండి. నాకేమిటిలాభం?" అన్నాను ఆవిడ ఏమంటారోనని.

ఆవిడ పెద్దగా నవ్వి "నువ్వు తెచ్చిన నిమ్మమొక్క పెరిగి పెద్దదవుతుందికదా! పెద్దదై కాయలు కాస్తుందికదా! అప్పుడా నిమ్మ కాయలతోనే పులిహోర చేసిపెడతాలే" అన్నారు. నేనూ నవ్వి వచ్చేశాను.

చాలాసేపు ఆలోచించాను ఎక్కడ దొరుకుతుందా! అని. మూర్తిగారు గుర్తొచ్చారు. 'ఆయనకి చాలా పెద్దతోట ఉంది. "అక్కడ నిమ్మ చెట్లు వుండకపోవు" అనుకొని మర్నాడు



ఉదయమే ఆయన దగ్గరికెళ్ళాను. నా కోరిక బైటపెట్టాను.

ఆయన చాలా బాధపడిపోతూ "అరరే! ఒక్కరోజు ఆలస్యంగా వచ్చావోయ్! నిన్ననే రెండు మొక్కలుంటే పికి కలెక్టర్ గారు కావాలంటే పంపించాను. ఇప్పుడన్నీ పెద్ద చెట్లే ఉన్నాయి. ఎలా" అన్నాడు బేలగా నావైపు చూస్తూ. ఒక్కరోజు ముందొస్తే కలెక్టర్ గారి కివ్వకుండా నాకే ఇచ్చే దాతలా మాట్లాడుతున్న ఆయనగారి అవకాశవాదానికి ఆశ్చర్యపోయి చేసేదేంలేక 'ఒక్క రోజులో అవకాశం కోల్పోయానే' అని చింతిస్తూ తిరిగొచ్చాను. కాలేజీకి టైమవటంతో వెంటనే తయారై వెళ్ళిపోయాను.

సాయంత్రం కాలేజీనుంచి రాగానే నా కాళ్లు అలవాటైనదార్లో సూటిగా హరి వాళ్ళింటికి దారి తీసినై.

"వాట్ ఫ్రెండ్! ఈ మధ్యన జాడలేవే బొత్తిగా! ఊళ్లో ఉన్నావా?" నన్ను చూడగానే ప్రశ్నించాడు హరి.

కాలేజీలో నాది ఈవెనింగ్ సెక్షన్, అతనిది మార్నింగ్ సెక్షన్ కావటంతో అక్కడ కలవటంలేదు. సాయంత్రం నేను వచ్చే టైమ్‌కే అతనికేవో పన్లుండి వెళ్ళిపోతాడు. అందుకే అప్పుడు కుదరటంలేదు. అన్నాను నేను.

హరి నవ్వుతూ "ఓకే! ఈ రోజునుంచి సాయంత్రాలన్నీ నీకే కేటాయిస్తాను. సరేనా?" అన్నాడు చెస్‌బోర్డుమీద పావులు సర్దుతూ. దాదాపు గంటసేపు ఆడుతూనే కూర్చున్నాం. ఇంతలో సరస్వతమ్మగారొచ్చారు లోపల్నుంచి. నన్ను చూడగానే ఏదో అడగబోయారు. అదేమిటో ఊహించిన నేను మధ్యలోనే అందుకొని "మీరు నన్ను మన్నించాలి. ఈ రోజు మీరు చెప్పింది చేయలేక పోయాను. రేపు తప్పకుండా ప్రయత్నిస్తాను" అన్నాను నవ్వుతూ. లోపల బాధగానేవుంది ఆవిడ చెప్పిన చిన్నపని చేయలేక పోయానని. నిమ్మమొక్క దొరకనందుకు ఆవిడ కూడా బాధపడినట్లే కన్పించింది.

హరికేం అర్థం కానట్లుంది "ఏమిటోయ్? మీ కోడ్ లాంగ్వేజ్?" అన్నాడు విసుగ్గా ముఖం చిట్లించి. నేను సంక్షిప్తంగా కథ వివరించాను. హరినవ్వి "ఓహో! ఈ భారం నీ భుజాన వేసుకున్నావా? వెరీగుడ్! కానియ్! మొదటి కేసు నేనే తీసుకోవాల్సి వచ్చింది. కానీ, నీకు తెలుసుగా, నాకంత ఓపికలేదని. అందుకే అమ్మతో నిర్మొహమాటంగా చెప్పేశాను. "నాకలాంటి పనులేవీ చెప్పొద్దని". అయితే నీకు చెప్పిందన్నమాట" అన్నాడు ఆవిడవైపు చూస్తూ.

"అతనికెందుకు చెప్పావు? ఏమైనా అనుకుంటాడేమో?" అన్నభావం కనిపించింది నాకు, హరికళ్ళలో. ఆవిడ హరివేపు కోపంగా చూసి "చాల్లే తెలివి. నువ్వు తేకపోగా, తెచ్చే


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!
Bensons-2141-TEL

వాణ్ణి కూడా చెడగొట్టే లాగున్నావే?" అని లోపలికెళ్ళారు. నేను చిన్నగా నవ్వాను. హరి నావైపు చూపి "నేను తెచ్చిపెడతానోయ్ అమ్మకి నిమ్మమొక్క. నీకెందుకు శ్రమ?" అన్నాడు. పెద్ద తెచ్చేవాడిలా పోజుకొడుతూ.

"నువ్వలాంటి పనులు చేస్తావంటే నేను నమ్మకేం? నీపనేదో నువ్వు చూసుకో. నా పని నేను చేస్తాను" అన్నాను.


ఆ తర్వాత రెండు రోజులు వాళ్ళింటికి పోవటం పడలేదు. మూడోరోజు వెళ్ళాను. ఆవిడని చూడగానే గుర్తొచ్చింది నాకు నిమ్మ మొక్క సంగతి నిజానికి నేనా విషయం మరిచేపోయాను.

అనుకున్నట్లుగానే ఆవిడ అడిగారు. నేను నాలిక్కరుచుకొని ఏదో సాకుచెప్పి మర్నాడు తప్పకుండా తెస్తానని తప్పించుకున్నాను. మరో వారంరోజులు గడిచాయి. ఈ మధ్యలో నాకు తెలిసిన వాళ్ళని అందరినీ అడిగిచూశాను. నిమ్మమొక్క కోసం. కానీ ఎక్కడా దొరక లేదు.

ప్రతిరోజూ ఆవిడ అడగటం, నేను సారి చెప్పటం జరుగుతూనే ఉంది. వారం రోజుల తర్వాత నాకే సిగ్గేసింది. అంత చిన్నపని చేసి పెట్టలేకపోయినందుకు. ఆవిడ దృష్టిలో ఉట్టి నిరుపయోగమైనవాణ్ణిగా కన్పించటం నాకిష్టం లేదు. అందుకే రెండురోజులు వరసగా వాళ్ళింటికే పోకుండా తప్పించుకున్నాను.

మర్నాడు వెళ్దామనుకున్నాను కానీ, అను కోకుండా మా మేనమామ వచ్చి రెండు రోజులు కాలేజీకి సెలవుండటంతో వాళ్ళ ఊరికి లాక్కొనిపోయాడు. అక్కడ నాకు సంతోషం కల్గించిన విషయిం ఏమిటంటే, ఇన్నాళ్ళు నేను సంపాదించలేని నిమ్మమొక్క ఆ పల్లెటూర్లో దొరికింది. నా శ్రమ ఫలించి నందుకు సంతోషించి మామయ్యకి మనసు లోనే థాంక్స్ చెప్పుకున్నాను.

ఊరినుంచి రాగానే నిమ్మమొక్కని తడి గుడ్డలో చుట్టి, అతిభద్రంగా పట్టుకొని వాళ్ళిం టికి బయలుదేరాను. సరస్వతమ్మగారు దీన్ని



చూడగానే ఎంత సంతోషిస్తారో అనుకున్నాను.

దార్లోనే హరి కన్పించాడు. నన్ను చూసి సైకిల్ దిగి "హలో మిత్రమా! ఎక్కడికెళ్ళావోయ్? నిన్న మీ ఇంటికొస్తే లేవని చెప్పారు" అన్నాడు. అనుకోకుండా ఊరికి పోవలసి వచ్చిన సంగతి చెప్పాను.

"సరేగాని మేం యిల్లు మార్చేశాం తెలుసా?" అన్నాడు. నేను ఆశ్చర్యంగా "ఎప్పుడూ?" అన్నాను.

"మొన్ననే మార్చాం. ఇక్కడికి దగ్గరే ఉంది. పదవెళ్దాం" అని సైకిల్ వెనక్కి తిప్పాడు. హరి నా చేతిలో నిమ్మమొక్కని గమనించనేలేదు. అతని కబుర్లేవో అతనే. నేనూ చెప్పలేదు. ఇద్దరం ఏదో మాట్లాడుకుంటూ పది నిమిషాలలో ఆ ఇంటికి చేరుకున్నాం. వరండాలో నన్ను కూర్చోబెట్టి హరి లోపలి కెళ్ళాడు. నేను తెచ్చిన నిమ్మమొక్క జాగ్రత్తగా కుర్చీలో నా పక్కనే పెట్టాను. ఇంటిని పరీక్షిస్తూ కూర్చున్నాను. అయిదు నిమిషాల తర్వాత కాఫీకప్పులతో ప్రవేశించాడు హరి.

"నూతన గృహప్రవేశ మహోత్సవ సందర్భంలో ఈ చిన్న పార్టీ" అంటూ నాకో కప్పు అందించాడు. నేను నవ్వి "థాంక్స్" అన్నాను.

కాపేపాగి "మీ అమ్మగారేరి?" అనడిగాను. నాకు చాలా ఆత్రుతగా ఉంది. నేను తెచ్చిన నిమ్మమొక్క ఆవిడకి చూపించి సంతోషపెట్టాలని.

"లోపల పనిలో ఉంది. మనమే వెళ్దాంరా" అని లోపలికి దారితీశాడు హరి.

నేనతన్ని అనుసరించాను, నిమ్మమొక్క చేతిలో పట్టుకొని.

పెరట్లో ఏదో పనిచేసుకుంటున్న సరస్వతమ్మగారు నన్నుచూసి పలకరింపుగా నవ్వారు. నేను నిమ్మమొక్క పట్టుకొని గబగబా నడుచుకుంటూ వెళ్ళాను.

"ఏమండోయ్! మీరడిగిన...." నా మాటలు మధ్యలోనే ఆగిపోయినై. అనుమానంగా కళ్ళు గట్టిగా నులుముకొని మళ్ళీ చూశాను.

పెరట్లో బావిపక్కనే బోలెడన్ని కాయలతో పెద్ద నిమ్మచెట్టు నన్ను వెక్కిరిస్తున్నట్లుగా చూసింది. ★

---

# రేపు!

చీమలు—
శ్రమజీవులు
సమతా రవులు
అహోరాత్రాలు—ని
ద్రాహారాలు మాని
పెట్టుకొనే పుట్టలను
సోమరి పాములు
పూత్కారాలతో
ఛీత్కారాలతో
తరతరాలుగా—కైవసం
కావించుకొంటున్న తతంగం
ఇక ముందు సాగదు!
తమ కష్టాలకు నష్టాలకు
మూలం తెలిసికొని
వర్గచైతన్యంతో
రేపు
నానావర్ణ పిపీలికాలు
సుశిక్షిత సైనికుల్లా
పుట్టను ముట్టడిస్తాయి!
కుబుసం విడని పాముని
కళ్ళకు పొరలు కమ్మిన పాముని
మట్టుపెడ్తాయి!

— అంగారం